తొలిరోజు ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు



చింతూరులో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



ఏపీఆర్ స్కూల్ సెంటర్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

చింతూరు/అడ్డతీగల/మారేడుమిల్లి/రాజవొమ్మంగి/గంగవరం/కూనవరం/ఎటపాక/వై.రామవరం/దేవీపట్నం : చింతూరు మండలంలో పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. చింతూరులోని గురుకుల పాఠశాల, నర్సింహాపురం బాలికల ఆశ్రమ పాఠశాల, మోతుగూడెంలోని డీఏవీ కేంద్రాల్లో 588 మంది విద్యార్థులకు గాను 587 మంది హాజరైనట్టు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని నర్సింహపురం బాలుర ఆశ్రమ పాఠశాలలో చిడుమూరు సర్పంచ్ కాక అరుణకుమారి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామయ్య, జయరాజు, ఫకీరుదొర, భీమయ్య పాల్గొన్నారు.

అడ్డతీగల మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సెంటర్‌లో 225 మందివిద్యార్థులు హాజరుకావలసి ఉండగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల సెంటర్‌లో 130 మంది విద్యార్థులూ హాజరైనట్టు ఎంఈవో మల్లేశ్వరరావు తెలిపారు. మారేడుమిల్లి గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాల, బోదులూరు బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 345 మంది తొలి రోజు తెలుగు పరీక్ష రాసినట్లు ఎంఈవో తాతాబ్బాయి తెలిపారు. రాజవొమ్మంగి మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలకు పూర్తి స్థాయిలో 130 మంది హాజరయ్యారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 156 మందికిగాను 155 మంది మాత్రమే రాశారు. జడ్డంగిలోని ఆశ్రమోన్నత పాఠశాలలో 120 మందికి 118 హాజరైనట్టు ఎంఈవో కె.తాతబ్బాయి తెలిపారు. సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పూర్తిస్థాయిలో 69 మంది హాజరయ్యారన్నారు. గంగవరం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎంఈవో మల్లేశ్వరరావు పరిశీలించారు. ఐదు ఉన్నత పాఠశాలలకు చెందిన 254మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరైనట్టు ఆయన వివరించారు. కూనవరం జిల్లాపరిషత్ హైస్కూల్, నర్శింగపేట ఆశ్రమపాఠశాలలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కూనవరంలో పూర్తిస్థాయిలో 245 మంది, నర్శింగపేట కేంద్రంలో 131 మందికి గాను 130 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో నీలి బాలరాజు తెలిపారు. ఎటపాక మండలంలో 261 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు పరీక్షకు ఇద్దరు గైర్హాజరయ్యారు. కేఎస్ పురం పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారి బాలరాజు తెలిపారు. వై.రామవరం మండలం యార్లగడ్డ గ్రామ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 146 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు మండల అకాడమిక్ అధికారి జి.ఆనందరావు తెలిపారు. దేవీపట్నం మండలం ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి తెలుగు పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. 220 మందికి గాను 211 మంది విద్యార్థులు హాజరయ్యారు. 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో వై. మల్లేశ్వరరావు తెలిపారు.

అరకులోయ నియోజకవర్గంలో

డుంబ్రిగుడ/హుకుంపేట/అనంతగిరి/ముంచంగిపుట్టు/పెదబయలు/అరకులోయ: డుంబ్రిగుడ మండల కేంద్రంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 573 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పాడేరు డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. హుకుంపేట మండలంలో మొత్తం 695 మంది విద్యార్థులకు గాను 693 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో బాబూరావు తెలిపారు. పాడేరు ఐటీడీఏ డీడీ కొండలరావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.అనంతగిరి మండలంలో 666 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ముంచంగిపుట్టు మండలంలో మూడు కేంద్రాల్లో 458 మందికి గాను 442 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, 16 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో చెల్లయ్య తెలిపారు.పెదబయలు మండలంలోని మూడు కేంద్రాల్లో 546 మందికి గాను 542 మంది పరిక్షలకు హాజరయ్యారు, నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. అరకులోయ మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గురుకుల బాలురు పరీక్ష కేంద్రంలో 181 మందికి గాను ముగ్గురు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 192 మంది గాను ఒకరు, కొత్తబలుగుడలో 244 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కంఠబంసుగుడ 177లో మందికి గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారయణ తెలిపారు.

పాడేరు నియోజకవర్గంలో...

చింతపల్లి రూరల్/జి.మాడుగుల: మండల కేంద్రంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సుమారు 600 మంది విద్యార్థులు మూడు కేంద్రాల్లో పరీక్షలు రాసినట్టు ఎంఈవో ప్రసాద్ తెలిపారు. రెగ్యులర్ పరీక్షలతో పాటు దూర విద్యా పదోతరగతి,ఇంటర్మీడియెట్ పరీక్షలు కూడా ప్రశాంతంగా జరిగినట్టు ఆయన చెప్పారు. చింతపల్లి,గూడెంకొత్తవీధి,కొయ్యూరు,పాడేరు ప్రాంతాల నుంచి దాదాపు 800 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆయన తెలిపారు.

జి.మాడుగులమండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 590 మంది పదోతరగతి పరీక్షలు రాయాల్సిండగా నలుగురు విద్యార్థులు గైర్హజరయ్యారు.గాంధీనగర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



చింతపల్లి : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



డుంబ్రిగుడలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పెదబయలు గురుకుల పాఠశాలలో నోటీసు బోర్డులో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

క్లుప్తంగా

సంత వేలం ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

చింతూరు: స్థానికంగా ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంత వేలంపాటను సోమవారం సర్పంచ్ కారం కన్నారావు అధ్యక్షతన స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. కేవలం గిరిజనులకు మాత్రమే నిర్వహించిన ఈ వేలంపాటలో 40 మంది పాటదారులు పాల్గొన్నారు. వేలంపాటలో చింతూరుకు చెందిన బాబా స్వయం సహాయక సంఘం సభ్యులు రూ.5.99 లక్షలకు పాటను దక్కించుకున్నారు. 2023–24 ఏడాదికి గాను ఈ వేలం పాటను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా అన్నసమారాధన

మారేడుమిల్లి : శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక రామాలయం వద్ద గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాసు రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మారేడుమిల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

రాజవొమ్మంగి : మండలంలోని చికిలింత పంచాయతీ, కరుదేవపాలెంలో గ్రామస్తులు సోమవారం సామూహిక మృత్యుంజయ హోమం నిర్వహించారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఈ కార్యక్రమం తలపెట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. కొండ వాగు వద్ద ఈ కార్యక్రమాలు జరిపించినట్టు పురోహితులు ఈమని లక్ష్మీ నరసింహ, సత్యనారాయణమూర్తి చెప్పారు.

శంకులమిద్దేలో రీసర్వే ప్రారంభం



భూసర్వే ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ శంకులమిద్దే గ్రామంలో సోమవారం భూసర్వేను ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కె.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మత్స్యరాస జయసింహరాజు, వీఆర్వో కాంతరావు, మాజీ సర్పంచ్ గబ్బాడి పండుదొర, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత చింతూరు



విజేతగా నిలిచిన చింతూరు బ్లూస్టార్ జట్టు

చింతూరు: ఫర్ ది పీపుల్ యూత్ ఆధ్వర్యంలో కూనవరంలో నిర్వహించిన ఉమేష్‌చంద్ర మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో చింతూరుకు చెందిన బ్లూస్టార్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం వీఆర్‌పురంతో జరిగిన ఫైనల్ మ్యాచ్ జరిగింది.

పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ



భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. సుమారు 200 మందికి ఈ ప్యాకెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో పీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకోవాలి

జి.మాడుగుల: తల్లిదండ్రులు లేని చిన్నపిల్లలు, 18సంవత్సరాల లోపు అనాథ పిల్లల వివరాలు సమీపంలోని అంగన్‌వాడీ టీచర్‌కు అందజేస్తే వారికి కేంద్రం నెలకు రూ.4,000 చొప్పున నగదు అందజేస్తుందని సీడీపీవో సువర్ణమ్మ సోమవారం తెలిపారు. తల్లి లేదా తండ్రి చనిపోతే డెత్ సర్టిఫికెట్, తల్లి,తండ్రి విడాకులుతీసుకుని విడిగా ఉన్నట్టయితే వీఆర్‌వో లెటర్, తల్లి, తండ్రి, బిడ్డ ఆధార్ కార్డులు, బిడ్డ పుట్టిన తేదీ సర్టిఫికెట్, గార్డియన్ తల్లి గాని తండ్రి గాని ఎవరు ఉంటే వారితో బిడ్డకు జాయింట్ బ్యాంకు అకౌంట్ లేదా బిడ్డ పేరున అకౌంట్ తీసుకోవాలని వివరించారు. ఇద్దరు పిల్లలైతే రెండు బ్యాంక్ అకౌంట్లు ఉండాలని, అంగన్‌వాడీ టీచర్ దగ్గర దరఖాస్తు తీసుకొని వివరాలు పూర్తిచేసి అందజేయాలని ఆమె కోరారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిట్టా రామారావు

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయి త్యాగం చేస్తున్న నిర్వాసితులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యుడు చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని కోరారు. వీఆర్‌పురంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.బతుకుదెరువు నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని నిర్వాసితులుగానే గుర్తించి ప్యాకేజీ అందించాలన్నారు. సర్వే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను నిర్వాసితులుగా ప్రకటించి పరిహారం అందజేయాలన్నారు.

5న ఆసరా చెక్కుల పంపిణీ

చింతూరు: మండలం కేంద్రంలో ఈనెల 5న నిర్వహించే మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాల మైదానంలో మధ్యాహ్నం రెండు గంటలకు చెక్కులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

హుకుంపేట: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు క్రీడల్లో రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇంటుబు సామ్యేల్, స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ నైని సత్తిబాబు,కార్యదర్శి నాగబాబు,సర్పంచ్‌లు దనసాని సత్యవతి,శాంతకుమారి, లక్ష్మి,చిన్నారావు,ఎంపీటీసీలు కిలగడ సింహాచలమమ్మ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

వై.రామవరం: స్థానిక వారపు సంత శివారులోని ప్రధానరహదారిలో సోమవారం మధ్యాహ్నం స్థానిక ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో రవాణా చేస్తున్న సామగ్రిని పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదుచేశారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముంచంగిపుట్టు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండలంలోని దార్రెల పంచాయతీ డి.కుమ్మరిపుట్టులో సోమవారం 22 మంది గిరిజనులకు ఎంపీపీ సీతమ్మ,సర్పంచ్ పాండురంగస్వామి, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్ పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పట్టాలను గిరిజన రైతులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేత జయదేవ్, పంచాయతీ కార్యదర్శి,అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



డి.కుమ్మరిపుట్టులో రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సీతమ్మ,నేతలు

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

రంపచోడవరం: వై.రామవరంలో ఇటీవల గుండె పోటుతో మరణించిన పాస్టర్.సి.హెచ్.రాజు కుటుంబ సభ్యులకు ఖజిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సాయంఅందజేసింది.సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బిషప్ స్టిపెన్ ఆధ్వర్యంలో పాస్టర్‌లు మనోహర్ , ఈ.ఈ మనోహర్, ఐ.చంద్ర పాల్ ఆధ్వర్యంలో రూ. 10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం పాస్టర్ ప్రెసిడెంట్ సాల్మన్ , పాస్టర్ మిల్కీసాదేక్, ఐజాక్ సామ్యూల్, పోలవరం జి.పాల్ పాల్గొన్నారు.

జూలై 31 వరకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు

మాడుగుల రూరల్: జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా జూలై 31వ తేదీ వరకు ఉచితంగా కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ వేస్తున్నామని మాడుగుల పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయడు తెలిపారు. సోమవారం కె.జె.పురంలో రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు వద్ద ఇంజక్షన్లు ఉంటాయన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962 ట్రోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని సూచించారు. అనంతరం పశువైద్య సంచార వాహనంలో హైడ్రాలిక్ లిఫ్ట్ సహాయంతో పశువులు ట్రైవిస్‌ను ఉపయోగించి, 16 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పశువైద్యాధికారి మణిలక్ష్మణ్, పశువైద్యశాఖ సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ



విద్యార్థినులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్న మౌనిక

నర్సీపట్నం: విద్యార్థినుల ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ ఎంతో దోహదపడుతుందని పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేతిరెడ్డి విజయ్ అన్నారు. బండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్ ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్, సమగ్ర శిక్ష అభియాన్ సౌజన్యంతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ నెల 24 వరకు శిక్షణ ఇస్తామని నింజాస్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. నేషనల్ మెడలిస్టులు వేపాడ ప్రియాంక, బొంతు మౌనిక శిక్షణ ఇస్తారని స్పష్టం చేశారు. హెచ్ఎం వూడి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ గోము వెంకటలక్ష్మి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు రెండవ విడత పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. పీహెచ్‌సీలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలని ఆమె మెడికల్ ఆఫీసర్లను కోరారు.

ఐదు పనులకు ఎస్టిమేషన్లు

రిపేర్స్ అండ్ రినోవేషన్ కింద మండలంలోని ఐదు సాగునీటి వనరుల అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్లు రూపొందించి ఐటీడీఏ పీవోకు సమర్పించినట్టు మైనర్ ఇరిగేషన్ జేఈ హరి సభలో తెలిపారు. దాటుగొమ్ము వాగు చెక్‌డ్యామ్‌కు రూ.2.8 లక్షలు, మడేరు ఆనకట్ట రిపేర్ల కోసం రూ. 177.45 లక్షలు, ఇదే ఆనకట్ట ఎడమకాలువ పూడిక తీత పనుల కోసం రూ.2.65 లక్షలు, వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రధాన పంటకాలువలో పూడికతీత పనులకు రూ. 2.98 లక్షలు, వట్టిగెడ్డ రిజర్వాయర్ మరమ్మతుల కోసం రూ.108.7 లక్షల అంచని వ్యయంతో ప్రతిపాదనలు పంపామని జేఈ తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాలను నేటికీ ఐసీడీఎస్‌కు అప్పగించలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు.

బోయ, బెంతు, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ ఆదివాసీ జేఏసీ సభ్యులు సర్వసభ్య సమావేశం జరుగుతున్న కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆందోళనకారుల వద్దకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వెళ్లి సర్ది చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకొని వెళతామని హామీ ఇచ్చారు. వైస్‌ఎంపీపీలు జుర్రా రాజేశ్వరి, చప్పా చంద్రరాణి, కోఆప్షన్‌మెంబర్ కామేష్, ఎంపీడీవో బాపన్నదొర, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జ్ సింగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంసెట్ కోచింగ్ ప్రారంభం



జి.మాడుగుల గురుకులం కళాశాలలో ఎంసెట్ కోచింగ్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పారయ్య

జి.మాడుగుల: స్థానిక గురుకుల కళాశాలలో ఎంసెట్ కోచింగ్‌ను సోమవారం ప్రిన్సిపాల్ పారయ్య ప్రారంభించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో గల చింతూరు, జీలుగుమిల్లి,కె.ఆర్.పురం, మారేడుమిల్లి అడ్డతీగల, రంపచోడవరం, పాడేరు ఐటీడీఏ పరిధిలో అరకు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి,కొయ్యూరు, కళాశాలలో ఎంపికచేసిన 160మంది విద్యార్థులకు మే 16వరకు ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్టు పారయ్య తెలిపారు.

బీమా చెక్కు అందజేత

వై.రామవరం: మండలంలోని రాచపాలెం గ్రామానికి చెందిన కడబాల కాసులమ్మ అనే మహిళలకు సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజరు యు.నాగరాజు రూ.2లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈసందర్భంగా మేనేజరు మాట్లాడుతు కాసులమ్మ భర్త కడబాల శ్యామలరావుకు ఎస్‌బీఐ ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమాయోజన పథకంలో(పీఎంజే జేబీవై) బీమా చేయించామన్నారు. ఇటీవల శ్యామలరావు మృతి చెందగా నామినీ అయిన అతని భార్య కాసులమ్మకు రూ.2 లక్షలలు బీమా చెక్కు అందజేశామన్నారు. ఈ పథకం గురించి తెలియని వారికి అవగాహన కల్పించి, బీమా చేయిస్తున్నట్టు చెప్పారు. ఇంతవరకు సుమారు 12 మందికి బీమా చెక్కులను అందజేశానన్నారు. ఈకార్యక్రమంలో క్యాషియర్లు దీపక్, శ్రీనివాస్, వీరరాజులు పాల్గొన్నారు.



కాసులమ్మకు బీమా చెక్కును అందజేస్తున్న బ్రాంచి మేనేజరు నాగరాజు

నేడు ఆసరా సంబరాలు

ఎటపాక: మండలంలోని తోటపల్లి గ్రామంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నారు.ఈకార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని లబ్ధిదారులకు మూడవ విడత ఆసరా చెక్కులు పంపిణీ చేయనున్నారు.ఏపీజీవి బ్యాంకు ఎదురుగా ఉన్న ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ తెలిపింది.

వీధి కుళాయిలు ప్రారంభం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని సాయి నగర్ వీధిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పంచాయతీ నుంచి రూ.2.5 లక్షలను విడుదల చేయడంతో ఆ వీధిలో పది వీధి కుళాయిలు ,పైపు లైను ఏర్పాటు చేశారు. వీటిని సోమవారం సర్పంచ్ దురియా పుష్పలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సర్ణలత, కో–ఆప్షన్ మెంబర్ నజర్ వలీ,వార్డు నంబర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కుళాయిలు ప్రారంభిస్తున్న సర్పంచ్

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు



చిరుధాన్యాల వంటకాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డుంబ్రిగుడ: చిరు ధాన్యాల వంటకాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని డుంబ్రిగుడ సీడీపీవో నీలమ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాగులు,జొన్నలు,కొర్రాలు,సామలు,ఊదలు,సజ్జలు వంటి చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.